లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాలి

లోక్‌అదాలత్ పై కాలనీవాసులకు అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ రాజు, తదితరులు

సైదాబాద్, జూన్ 3: న్యాయస్థానాల్లో అపరిష్కృతంగా నిలిచిపోయిన కేసులను ఈనెల 14న నిర్వహించే లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని హైదరాబాద్ జిల్లా పారా లీగల్ వాలంటీర్ పి. సత్యనారాయణ రాజు అన్నారు. ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సరస్వతి నగర్ కాలనీ పార్క్‌లో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏళ్ల తరబడి న్యాయస్థానాల్లో నిలిచిపోయిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని, దీంతో మీరు చెల్లించిన కోర్టు ఫీజులను వాపస్ పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. భార్య, భర్తల మధ్య వివాహసంబంధమైన వివాదాలు, మనోవర్తి, విడాకులు, అత్తింటి వారి పిల్లల మనోవర్తి, అలాగే వివిధ రకాల సివిల్ కేసులు, భూవివాదాలు, చెక్ బోన్స్, క్రిమినల్ కేసులు చట్టరీత్యా రాజీకి అర్హత కలిగిన అన్ని కేసులను లోక్ అదాలత్ ద్వారా ఎలాంటి ఫీజులు, ఖర్చులు లేకుండా శాశ్వతమైన అంగీకార యోగ్యమైన సత్వర పరిష్కార మార్గాలను పొందవచ్చునని ఆయన తెలిపారు. వివాదాలు కోర్టు వరకు వెళ్లని పక్షంలో ఇరు పార్టీల వారు తమ యొక్క తగాదాలను సంబంధిత జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గాని, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థలను కోరవచ్చునన్నారు. పలుమార్లు న్యాయస్థానాల చుట్టూ తిరిగే పనిలేకుండా సుహృద్భావ వాతావరణంలో అప్పీల్ లేని, న్యాయబద్ధమైన అంతిమ తీర్పును పొందటానికి లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, జూన్ 3 : విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు అస్మాన్ ఘడ్ డీఈ విష్ణువర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ శివగంగ , 11 కేవీ తిరుమల హిల్స్, 11 కేవీ గడ్డి అన్నారం,11కేవీ రేస్ కోర్స్ రోడ్, 11కేవీ మూసారం బాగ్ ఫీడర్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, 11కేవీ సలీం నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 1:30 గంటల వరకు, 11కేవీ ఫర్హత్ హస్పిటల్ ఫీడర్ పరిధిలో ఉదయం 10:30 గంటల నుంచి 12 గంటల వరకు,11కేవీ జీ ఏ బ్యాంకు కాలనీ, 11కేవీ ఎస్బీహెచ్ కాలనీ, 11కేవీ శాలి వాహన నగర్, 11కేవీ హరి హర క్షేత్రం ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఆయా ఫీడర్ల ప్రాంతాలతో పాటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, జూన్ 3: రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నట్లు మాజీ మంత్రి,ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న అనంతరం దివ్యాంగుడితో కాసేపు ముచ్చటించిన తరువాత ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని తెలిపారు. కులవృత్తులను నమ్ముకొని జీవిస్తున్న వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న ప్రజలను ఆదుకున్నట్లు వివరించారు. గొల్ల, కురుమ, మత్స్యకారులను పట్టించుకోవడంలేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే వారికి కావలసిన సదుపాయాలను ఏర్పాటు చేయడానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, స్థానిక మాజీ సర్పంచ్ బ్రాహ్మణపల్లి జ్యోతి చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురసాని సురేందర్ రెడ్డి, నియోజకవర్గం సీనియర్ నాయకుడు గంగాపురం లక్ష్మీనర్సింహ రెడ్డి, స్థానిక మాజీ ఎంపీటీసీ కాకి రాములు, ఎంపీటీసీ ఫోరమ్ మాజీ అధ్యక్షుడు సురసాని రాజశేఖర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుక మేఘనాథ్‌రెడ్డి, డైరెక్టర్లు పొట్టి ఆనంద్, సురసాని శేఖర్ రెడ్డి, మాజీ డైరెక్టర్ సామ ప్రకాష్ రెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి, ఢిల్లీ గణేష్, యూత్ అధ్యక్షుడు తాళ్ల కార్తీక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సామయ్య, సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్ రెడ్డి, ఉద్యమకారుడు కాకి నర్సింహ ముదిరాజ్, సీనియర్ నాయకుడు సురసాని సుదర్శన్ రెడ్డి, కార్యదర్శి బర్కం వెంకటేష్, యూత్ నాయకుడు గొరైంకల రామకృష్ణ, గ్రామ అధ్యక్షుడు కాసోజు శివప్రసాద్ చారి, నాయకులు శంకరి, తిరుపతయ్య, ఢిల్లీ పాండు, అంజయ్య, బొక్క వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.



దివ్యాంగుడితో మాట్లాడుతున్న సబితా ఇంద్రారెడ్డి

ఆలయ అభివృద్ధికి కృషి

కందుకూరు, జూన్ 3: ప్రజలపై అమ్మ కృప ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని మీర్ ఖాన్ పేట్ గ్రామంలో ఏర్పాటు చేసిన రేణుక ఎల్లమ్మ, పోచమ్మల విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్నారు. అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు, గ్రామస్తులు ఆమెను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి కావలసిన సౌకర్యాల కల్పించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు భగవంతుని ఆశీస్సులు ఉండాలని కోరారు. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. గ్రామస్తుల కోరిక మేరకు భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతానని వివరించారు.



రేణుక ఎల్లమ్మ, పోచమ్మ అమ్మవార్లను దర్శించుకున్న సబితా ఇంద్రారెడ్డి

9 నుంచి వేంకటేశ్వరస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

సిటీ బ్యూరో, జూన్ 3: మన్సూరాబాద్ డివిజన్ పరిధి ఆదిత్య నగర్ కాలనీలో శ్రీలక్ష్మి పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయ 13వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 9 నుంచి 12 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ చైర్ పర్సన్ టి. సంతోషి కుమారి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో నూతనంగా నెలకొల్పుతున్న ధ్వజస్తంభ ఏర్పాట్ల పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శ్రీమాన్ కంజర్ల రామకృష్ణ ఆచార్య స్వామి పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 11న వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టి.మోహన్ రెడ్డి, రవికుమార్, అర్చకులు కొండలాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న ఆలయ చైర్ పర్సన్ సంతోషి కుమారి

ఘనంగా మంత్రి హరీశ్‌రావు జన్మదిన వేడుకలు

బీఎన్‌రెడ్డినగర్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

వనస్థలిపురం, జూన్ 3 : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ యూత్ జిల్లా ఇన్‌చార్జి మాధవరం నర్సింహ్మారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీఎన్‌రెడ్డి నగర్‌లో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా నర్సింహ్మారావు మాట్లాడుతూ, హరీశ్‌రావు లాంటి నాయకుడు తెలంగాణలో ఉండడం గర్వకారణమన్నారు. తెలంగాణ సాధనలో ఆయన పాత్రను మరువలేమన్నారు. తెలంగాణ అభివృద్ధిలో హరీశ్‌రావు ముద్ర ఉంటుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి చరిత్ర సృష్టించారన్నారు. ఈ కార్యక్రమంలో కావేటి రమేష్, బొమ్మిడి ప్రవీణ్‌రెడ్డి, హరీష్‌రావు, కోట్ల ప్రశాంత్‌రావు, చేగోరి భాస్కర్, మేకల శ్రీకాంత్, శివ, రఘు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ

కందుకూరు, జూన్ 3: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడానికి కృషి చేస్తున్నట్లు ప్రొఫెసర్ విద్యాసాగర్ తెలిపారు మండల కేంద్రంలో గల రైతు వేదికలో మంగళవారం 'గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తనం' అనే కార్యక్రమం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ విద్యాసాగర్ హాజరై మాట్లాడుతూ, తెలంగాణలోని ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనం అందించడం యూనివర్సిటీ బాధ్యతగా స్వీకరించిందని తెలిపారు. ఇందులో భాగంగా వరి, మొక్కజొన్న,నువ్వులు, పప్పు దినుసులు, ఫౌండేషన్ సీడ్‌ను అందజేస్తున్నట్లు వివరించారు. ప్రతి రెవెన్యూ విలేజ్‌కు ముగ్గురు అభ్యుదయ రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. తద్వారా ఉత్పత్తి చేసిన విత్తనాలను తమ మండలంలోని ఇతర రైతులకు ఇవ్వడం ద్వారా రైతులు లాభ పడతారని తెలిపారు. మండలంలోని 72 మంది రైతులకు ఈ ఫౌండేషన్ సీడ్ కిట్‌లను ఇచ్చినట్లు తెలిపారు. తద్వారా వచ్చే సంవత్సరానికి దాదాపు 3 వేల ఎకరాలకు పైగా విత్తనాన్ని తమ మండలంలోని రైతులకే అందించవచ్చని పేర్కొన్నారు . ఏఎన్ఎం 1638 రకం 120 నుంచి 130 రోజుల కాలపరిమితి గల పంట ఎకరాకు 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని తెలిపారు. అభ్యుదయ రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అలాగే ఇతర రకాలను వేసుకోవాలనే రైతులు వ్యవసాయ యూనివర్సిటీ, రాజేంద్రనగర్ క్యాంపస్ నందు కొనుక్కోవడానికి సౌలభ్యం ఉందని వివరించారు. వ్యవసాయ అధికారి లావణ్య మాట్లాడుతూ, రైతులు ఉత్తమ నాణ్యత గల విత్తనాన్ని ఉత్పత్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో విస్తరణ అధికారులు రాఘవేంద్ర చారి, రాజు, నర్మదా పాటిల్, శ్రీహరి, సైముద్దీన్ పాల్గొన్నారు.

వరద నీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

సైదాబాద్, జూన్ 3: వర్షాకాలంలోగా శంకేశ్వర్ బజార్ నాలా పనులు పూర్తిచేసి, బస్తీలలో ముంపు సమస్యను నివారించాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణరవీందర్ రెడ్డి జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. మలక్‌పేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జయంత్, ఏఈ వెంకన్నతో కలిసి మంగళవారం శంకేశ్వర్ బజార్ నాలా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బస్తీవాసులకు వరద నీటి ఇబ్బందులను తొలగించడానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. మూడు రోజులపాటు జరిగే పారిశుధ్య స్పెషల్ డ్రైవ్‌ను డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీలలో రోడ్ల పక్కన ఉన్న చెత్త కుప్పలు, మట్టి, చెట్ల కొమ్మలను తొలగించి శుభ్రం చేయాలని జీహెచ్ఎంసీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎంహెచ్ఓ రుద్ర శ్రీనివాస్, ఎస్ఎఫ్ఎలు దేవేందర్, నాగరాజు , కళ్యాణ్ , ఫజల్, సలావుద్దీన్, మాధవ నగర్ కాలనీ అధ్యక్షుడు బిందు శ్రీనివాస్, వినోద్, కాలనీవాసులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి: మంత్రి శ్రీధర్ బాబు

చంపాపేట, జూన్ 3: రాష్ట్రంలో నెలకొన్న ఆర్థిక ఇబ్బందులను అధిగమించి అభివృద్ధిలో ముందుకు సాగుతున్నట్లు రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. చంపాపేట్ డివిజన్లో 10 కోట్ల 94 లక్షల 75 వేల రూపాయలతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ దయానంద్, ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మధుయాష్కి గౌడ్, స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డితో కలిసి మంగళవారం మంత్రి ప్రారంభించారు. ఇందులో భాగంగా కర్మన్ ఘాట్ మాధవ నగర్ కాలనీలో నూతనంగా రూ.1 కోటి 17 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న ఆర్థిక ఇబ్బందులను అధిగమించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్ల తెలిపారు. ఒక ప్రణాళిక ప్రకారం హైదరాబాద్ నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పని చేయాలన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎంపీ రాజేందర్, ఇతర సభ్యులు ప్రత్యేక నిధులు రాబట్టుకొచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎల్బీనగర్ నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని అందుకు అనుగుణంగా నిధులు మంజూరు అవుతున్నట్లు తెలిపారు. ఎంపీ రాజేందర్ మాట్లాడుతూ, మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం లో వలసవాదులు ఎక్కువగా నివసిస్తున్నారని, వారికి అనుగుణంగా అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. కార్పొరేటర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ,డిప్యూటీ కమిషనర్ సేవాలాల్, రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, ధర్మకర్తలు ఈదులకంటి సత్యనారాయణ రెడ్డి, కవిత, నాగరాజు, విష్ణువర్ధన్ రెడ్డి,గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ గణేష్ నాయక్, రాజశేఖర్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బెనర్జీ, కోశాధికారి మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు గౌని అనసూయ, మాజీ అధ్యక్షులు మణిపాల్ రెడ్డి, చెంబు ప్రసాద్, సాంబమూర్తి , పాండయ్య, నరసింహగుప్త, హనుమంత్ రెడ్డి, నాయకులు గూడూరు అవినాష్ రెడ్డి, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

కర్మన్ ఘాట్ మాధవనగర్‌లో నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

పార్కును ప్రారంభించిన మంత్రి

వనస్థలిపురం, జూన్ 3: వనస్థలిపురం డివిజన్ మల్లికార్జున నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన పార్కును రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంగళవారం ప్రారంభించారు. కాలనీలో ఉన్న స్థలంలో ఇటీవల నూతనంగా ఈ పార్కును నిర్మించారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకోవాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల వెంకటేశ్వరరెడ్డి, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బుడంపాటి సౌమ్యకు పీహెచ్‌డీ పట్టా

ఆర్కే పురం, జూన్ 3: 'రోల్ ఆఫ్ ఎంఎఫ్ఐఎస్, కమర్షియల్ బ్యాంక్స్ అండ్ సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ ఇన్ ద రూరల్ డెవలప్‌మెంట్ ఆఫ్ తెలంగాణ' అనే అంశంపై డా. దొంతల రఘునాథ్‌రెడ్డి మార్గదర్శకత్వంలో పరిశోధన చేసి జేఎన్‌టీయూ, హైదరాబాద్ నుండి మేనేజ్‌మెంట్ సైన్స్ విభాగంలో కొత్తపేటకు చెందిన బుడంపాటి వెంకట శివ సౌమ్య పీహెచ్‌డీ పట్టా పొందారు. ప్రస్తుతం సౌమ్య హైదరాబాద్ లోని శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, మిత్రులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న సౌమ్య

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు, జూన్ 3: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతో దోహదపడతాయని కందుకూర్ డివిజన్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి అన్నారు. మండలంలో దెబ్బడగూడ, బాచుపల్లిలో మంగళవారం రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. దెబ్బడగూడలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 20వ తేదీ వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు కొనసాగుతాయని వివరించారు. మాజీ సర్పంచ్ జంగయ్య గ్రామంలో శ్మశాన వాటికకు స్థలం మంజూరు చేయాలని కోరారు. కొంతకాలంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆయనకు వివరించారు. ప్రస్తుతం ఉన్న శ్మశాన వాటికలో స్థలం లేక అవస్థలు పడుతున్నట్టు వివరించారు .కనీసం ఆరు ఎకరాల భూమిని కేటాయించాలని విన్నవించారు. ఈ విషయాన్ని పరిశీలిస్తానని జగదీశ్వర్ రెడ్డి వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ శేఖర్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

దెబ్బడగూడలో అర్జీలను తీసుకుంటున్న జగదీశ్వర్ రెడ్డి

బాచుపల్లిలో....

భూ భారతితో ప్రజలకు మేలు జరుగుతుందని మార్కెట్ చైర్మన్ కృష్ణా నాయక్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగా రెడ్డి, తహసీల్దారు గోపాల్, మాజీ జెడ్పీటీసీలు ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, అందుగుల సత్యనారాయణతో కలిసి ఆయన మాట్లాడుతూ, భూభారతి ద్వారా భూసమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, అందులో భాగంగా రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు జానీ, రాణా ప్రతాప్ రెడ్డి, మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్, కృష్ణ, మాజీ ఎంపీటీసీ సరికొండ పాండు, మహేందర్ అజీజ్, డైరెక్టర్లు విష్ణువర్ధన్ రెడ్డి, ఢిల్లీ శ్రీధర్, బుక్క పాండు రంగా రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు శేఖర్, రెవెన్యూ సిబ్బంది,

ఇందిరమ్మ కమిటీ సభ్యులు విజయ్, యుగంధర్ రెడ్డి, రాజశేఖర్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కత్తుల వెంకటేష్, మాజీ సర్పంచ్‌లు ఆరోగ్య రెడ్డి, రాములు, మజీ ఎంపీటీసీ సభ్యుడు సురేష్, పార్టీ నాయకులు శంకరయ్య యాదవ్, శ్రీశైలం, రాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాచుపల్లిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్ గోపాల్

బీజేపీ మతతత్వ విధానాలను రెచ్చగొట్టి ప్రజలను చీలుస్తోంది

సిటీ బ్యూరో, జూన్ 3: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతతత్వ విధానాలను రెచ్చగొట్టి ప్రజలను చీలుస్తుందని సీపీఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ ఇందిరానగర్ కాలనీలో గణేష్ గౌడ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సీపీఎం పార్టీ హయత్ నగర్ సర్కిల్ కమిటీ సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశం సెక్యులర్ రాజ్యమని, కానీ బీజేపీ ప్రభుత్వం సెక్యులర్ విధానాలకు భిన్నంగా పాలన కొనసాగిస్తోందన్నారు. ఆపరేషన్ సింధూర పేరున పాకిస్తాన్ ఉగ్రవాదంపై భారత సైనికులు జరుపుతున్న దాడిని అమెరికా ఆజ్ఞానుసారం నిలిపివేయడం భారత సార్వభౌమాధికారాన్ని అమెరికాకు తాకట్టు పెట్టడమే నన్నారు. ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టు పెట్టడమే లక్ష్యంగా కర్రెగుట్టలో పదివేలకు పైగా సైనికులతో అనేక మంది మావోయిస్టులను హత మారుస్తున్నారని విమర్శించారు. కగార్ పేరిట జరుపుతున్న ఆపరేషన్ ను వెంటనే నిలిపివేసి, మావోయిస్టులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సాహెబ్ నగర్ కలాన్‌లోని సర్వే నెంబర్. 71, 162లోని ప్రభుత్వ స్థలాన్ని ఎల్బీనగర్‌లోని పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించి నిర్మాణాలు జరపాలని కోరారు. ఈ సమస్యపై ఈ నెల 30న 'చలో కలెక్టరేట్' పేరుతో ధర్నా నిర్వహిస్తున్నామని, ఇల్లు లేని నిరుపేదలు ఈ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ కార్యదర్శి కీసరి నర్సిరెడ్డి, కమిటీ సభ్యులు తిరుమల, సంధ్య, భాస్కర్. సిహెచ్ మల్లేశం, మెట్టు లింగం యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు , జూన్ 3 : సీఎం రిలీఫ్ ఫండ్‌ను పేదల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండల సీనియర్ నాయకులు సప్పిడి గోవర్ధన్ ముదిరాజ్ కోరారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ గ్రామానికి చెందిన ఎలిగెపల్లి శ్రీనివాసుకు రూ,.48 వేలు చెక్కు మంజూరు అయింది. చెక్కును బాధితులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదన్నారు. కార్యక్రమంలో నరసింహ , బాలరాజ్, శ్రీశైలం, శివకుమార్, గోపాల్, పాల్గొన్నారు.

మైనర్‌పై లైంగిక దాడి

సైదాబాద్, జూన్ 3: మైనర్ బాలికపై ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడికి పాల్పడిన సంఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సైదాబాద్ క్రాంతి నగర్‌లో నివసించే మైనర్ బాలిక తల్లిదండ్రులు ఒకరు ఎల్బీ నగర్‌లోని ఓ దవాఖానలో పనిచేస్తుండగా, భార్య చీరలు, స్టీలు ఇత్తడి వస్తువులను విక్రయిస్తుంటోంది. వీరికి ముగ్గురు సంతానం. కాగా 16 సంవత్సరాల బాలిక, ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. బాలిక ఈ మధ్యకాలంలో టెన్త్ క్లాస్ పూర్తి చేసింది. మాదన్నపేటలోని ఒక పాఠశాలలో చదువుతుండటంతో సైదాబాద్ నుంచి మాదన్నపేట వరకు గ్రీన్ పార్క్ కాలనీకి చెందిన మన్నే జగన్ (39) తన ఆటోలో వీరిని ప్రతి రోజు దింపి వస్తున్నాడు. ఈ క్రమంలో ఆటో డ్రైవర్ జగన్‌కు నాగలక్ష్మి (36)కి పరిచయం ఏర్పడి, ఆ పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. భర్త ఇంట్లో లేని సమయంలో ఆమె తన కూతురితో తరచూ ఆటో డ్రైవర్ ఇంటికి టిఫిన్, లంచ్ బాక్స్ లను పంపించేది. ఆదివారం జగన్, నాగలక్ష్మి ఇద్దరు ఇంటి నుంచి అదృశ్యమయ్యారు. దీంతో సోమవారం రాత్రి భర్త సైదాబాద్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఆ కేసులో విచారణ జరుపుతుండగా తన పట్ల జగన్ అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా లైంగిక దాడికి పాల్పడ్డాడని బాలిక తండ్రి వద్ద చెప్పింది. అదే విధంగా జగన్‌తోపాటు అతని స్నేహితుడు గ్రీన్ పార్క్ కాలనీకి చెందిన ప్రైవేట్ ఉద్యోగి భూక్యా బాల రాజు (34)కూడా లైంగిక దాడికి పాల్పడ్డాడని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు జగన్, నాగలక్ష్మి, భూక్యా బాలరాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని ఎస్సై సాయి కృష్ణ దర్యాప్తు దర్యాప్తు చేస్తున్నారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ, ఎల్ఎల్ఎం, డేటా సైన్స్ కోర్సు పరీక్ష ఫలితాలతో పాటు ఎంఈ, ఎంటెక్ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను విడుదల చేశామన్నారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

డిగ్రీ కోర్సుల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని వివిధ డిగ్రీ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని, ఫలితాలను తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మార్కుల మెమోలను సంబంధిత కళాశాల నుంచి మూడు వారాల తర్వాత పొందవచ్చని పేర్కొన్నారు. ఈ ఫలితాల రీరివాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి ఈ నెల 9వ తేదీలోగా, రూ.200 అపరాధ రుసుంతో 11వ తేదీ వరకు టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ. 1000 చొప్పున చెల్లించి ఈ నెల 11వ తేదీ వరకు తమ కార్యాలయంలో చెల్లించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

దూరవిద్య ఎంసీఏ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రామ్‌రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్ సీడీఈ) ద్వారా అందించే ఎంసీఏ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీఏ అన్ని సెమిస్టర్‌లో మెయిన్, బాక్‌లాగ్ ప్రాక్టికల్ పరీక్షలను ఈ నెల 11వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సు పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫీజును ఈ నెల 10వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

బీఈ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ) రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, బీఈ (సీబీసీఎస్), బీఈ (నాన్ సీబీసీఎస్) బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈ నెల 13వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ. 200 అపరాధ రుసుంతో 17వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

బీఈ కోర్సుల వన్ టైం చాన్స్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని అన్ని విభాగాల బీఈ కోర్సులు పూర్తిచేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలిపోయిన వారికి వన్ టైమ్ చాన్స్ కల్పించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓయూ అకాడమిక్ సెనేట్ స్టాండింగ్ కమిటీ అనుమతించిందని చెప్పారు. 2000 ఏడాది తరువాత ఆయా కోర్సుల్లో చేరినవారు సైతం తమ బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశమిచ్చామన్నారు. ఈ కోర్సుల అన్ని సెమిస్టర్ల పరీక్ష ఫీజును ఈ నెల 13వ తేదీలోగా, రూ.200 అపరాధ రుసుముతో కలిపి 17వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. అన్ని కోర్సుల పరీక్షలకు సాధారణ పరీక్ష ఫీజుతో పాటు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్ష విధానంలోనే వారు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.omania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.